క్లుప్తంగా

ఆదినం పీఠాధిపతితో అంజూరు భేటీ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్వామిజీ

శ్రీకాళహస్తి: తమిళనాడు రాష్ట్రం ధర్మపురిలోని ఆదినం పీఠాధిపతి శ్రీలాశ్రీమాశిలామణి దేశిగ పరమాచార్యను మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కలిశారు. ఆయన చేతుల మీదుగా ఆలయ నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ఆయన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ మఠం ఆధీనంలోని కొన్ని ముఖ్యమైన ఆలయాలను సందర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, ఆలయ గురుకుల్ ముత్తుస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహరాజు, భాస్కర్ ముదిరాజ్, లక్ష్మీపతి, సునీల్, బాలగౌడ్, తేజ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీవీ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగరాజునాయుడు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయానికి సంక్రాంతి పండుగ ప్రతీక అన్నారు. అందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలైన గాయత్రి, మునిరేవతి, సదియాకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారావు, రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు



చేతిపంపు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లె ఎస్సీ కాలనీలో మంగళవారం సర్పంచ్ పెంచలయ్య ఆధ్వర్యంలో చేతిపంపు మరమ్మతు పనులు చేపట్టారు. మూడు రోజుల క్రితం కాలనీలోని రెండు చేతిపంపులు పాడైపోయాయి. దీంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. సమాచారం అందుకున్న సర్పంచ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించి, తాగునీటి సమస్యను పరిష్కరించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కిట్లు అందజేస్తున్న మోహనప్రియ

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని ఎండీపుత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకోవాలని సూచించారు. తాజా కూరగాయలు, ఆకు కూరలు, పప్పుదినుసులు, మాంసకృత్తులతో కూడిన భోజనాన్ని తీసుకోవాలన్నారు. పౌష్టికాహార లోపంతో రక్తస్రావం సంభవించే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా గ్రామ సంరక్షణ కార్యదర్శి ప్రియదర్శిని, అంగన్‌వాడీ కార్యదర్శి విమలకుమారి, ఏఎన్ఎం లలిత పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్న ప్రగతి సంస్థ ప్రతినిధులు

రేణిగుంట: పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, గుత్తివారిపల్లె హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం ప్రగతి సంస్థ ప్రతినిధులు క్రీడా పరికరాలను అందజేశారు. బెంగళూరుకు చెందిన క్రై సంస్థ సహకారంతో తాము ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికి క్రీడా పరికరాలను పంపిణీ చేసినట్లు ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి తెలిపారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులు క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సునీత, శైలజ, ప్రగతి సిబ్బంది శిరీషా, నీరజ పాల్గొన్నారు.

నవరత్నాలతో జనరంజక పాలన

- నాగలాపురం గడప గడపలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నాగలాపురంలో లబ్ధిదారురాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్‌తో వివరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం నాగలాపురంలోని సన్నిధి వీధి, ఉత్తర కోట వీధి, దక్షిణ కోట వీధి, పద్మసాలి వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేసి వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. తొలుత పాత బస్టాండ్ వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

దక్షిణ కోట వీధిలో మురుగు కాలువలు లేకపోవడం వల్ల వీధుల్లో పారిశుద్ధ్య సమస్యలు వేధిస్తున్నాయని, వర్షం వస్తే బీసీ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉంటోందని సమస్యలు నివేదించారు. నాగలాపురం–టీపీ కోట డబుల్ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని, ఇళ్ల స్థలాలు, జగనన్న ఇళ్లు, పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, పార్టీ మండల కన్వీనర్ అవరంజిరాజు, ఎంపీడీఓ పద్మజ, సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ హనుమంతప్ప, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, వైస్ ఎంపీపీ కుమారి, సర్పంచ్ సుధ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, ఉదయ్‌కుమార్ రెడ్డి, గీత, నారాయణన్, మురళి, మోహన్ మొదలి, జగదీష్ రెడ్డి, దేశన్, డానియేల్ దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన

శ్రీకాళహస్తి: ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్ఎంఎస్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ అంజుయాదవ్ మాట్లాడుతూ పగలు కానీ, రాత్రి కానీ ప్రజలు తమ విలువైన బంగారాన్ని ఇంట్లో కాకుండా లాకర్‌లో భద్రపరచుకోవాలన్నారు. ఇంట్లోని బీరువాలు, అల్మారలో పెట్టకుండా ఎవరూ ఊహించిన ప్రదేశాల్లో మొత్తం ఒకే చోట కాకుండా విడివిడిగా పెట్టాలన్నారు. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దుకాణ యజమానులు ఎట్టి పరిస్థితుల్లో నగదు దుకాణంలో ఉంచకుండా వెంట తీసుకెళ్లాలని తెలిపారు. పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి



ఇనగలూరులో ప్రచారం చేస్తున్న నేతలు

శ్రీకాళహస్తి రూరల్: త్వరలో జరగనున్న చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థి పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో పట్టభద్రులను కలసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డి, దామతోటి ముని, పోలి గుణ, నక్క పెంచలయ్య, పుల్లూరు అశోక్‌రెడ్డి, రఘునాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, వేముల ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

కిల్కారి సేవలు 72 వారాలు ఉచితం



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): స్త్రీ గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి బిడ్డకు ఏడాది వచ్చే వరకు 72 వారాలపాటు కిల్కారి మొబైల్ అకాడమీ సేవలను ఉచితంగా అందిస్తుందని వైద్యాధికారి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. తొట్టంబేడు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కిల్కారి మొబైల్ అకాడమీ అందించే సేవలు మాతాశిశు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సేవలన్నారు. భారత ప్రభుత్వం నంబర్ 0124458000 ద్వారా విధిగా గర్భిణులు, బాలింతలు, ఆశాకార్యకర్తలకు వాయిస్ కాల్ ద్వారా ముఖ్య సూచనలు ఇస్తుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ కిల్కారి వాయిస్ ద్వారా వస్తున్న ప్రతి ఆరోగ్య విషయం గర్భిణులు, మాతాశిశు సంరక్షణకు తోడ్పడే సమగ్రమైన ఆరోగ్య సమాచారం అని, మాతాశిశు మరణాల నివారణకు ఎంతో ఉపయోగకరమైనదన్నారు. పీహెచ్ఎన్ సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు మహిళావర్సిటీ వలంటీర్లు

తిరుచానూరు: కర్ణాటక రాష్ట్రం హుబ్లీలోని ధార్వాడ్‌లో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ యువజనోత్సవాలు–2023కి శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.మాధవి వలంటీర్లు వవీఎన్ శ్రావ్య, జి.భవాని, రీజినల్ యూత్ ఆఫీసర్ నుంచి అనుమతి పొందిన మరో 12 మంది వలంటీర్లు ఎంపికయ్యారు. వీరిని ఎస్వీయూ రిజిస్ట్రార్ రజిని, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కాత్యాయని, ఎన్ఎస్ఎస్ యూనిట్–2 పీఓ కె.స్వాతి అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్యవేడు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, జీఓ నంబర్1ని రద్దు చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకురాలు నిర్మల, కాంతమ్మ, భువన, ఝాన్సీ, మంజుల, సువర్ణ, సుధ, చందామణి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

ఏర్పేడు: మండలంలోని మడిబాక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, ఎంపీడీఓ గిడ్డయ్య మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మడిబాక పంచాయతీ పరిధిలోని రాజులకండ్రిగ, మడిబాక, ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వెల్లడించారు.

టిప్పర్లను నియంత్రించాలని ఆందోళన

సత్యవేడు: పట్టణంలో టిప్పర్లను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ స్థానిక లాయర్ జక్కుల రామ్మూర్తి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే హెచ్.హేమలత ఆధ్వర్యంలో స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద ఆందోళ చేశారు. టిప్పర్లు ఓవర్‌లోడు, మితిమీరిన వేగంతో పట్టణంలో వెళ్తున్నాయని, వీటి మూలాన విద్యార్థులు, మార్కెట్‌కు రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వీటివల్ల రోడ్లు కూడా దెబ్బతింటున్నాయని, పలు చోట్ల చిన్న తూములు ఉన్న రోడ్లు కుంగిపోయాయని పేర్కొన్నారు. ఇకనైనా పోలీసులు వీటిపై దృష్టి సారించి కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రూ.42 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్



నిర్మాణంలో ఉన్న శానిటరీ కాంప్లెక్స్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 14 గ్రామ సచివాలయాల వద్ద రూ. 42 లక్షలతో శానిటరీ కాంప్లెక్సులను నిర్మిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఒక్కో సచివాలయం వద్ద రూ. 3 లక్షలతో వీటిని నిర్మిస్తామని, నిర్మాణం పూర్తయితే సిబ్బంది, ప్రజలకు మరుగుదొడ్ల సమస్య తీరుతుందని చెప్పారు.

ఈ–క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులందరు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ చేసుకోవాలని వీఆర్ఓ ప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు ఈకేవైసీ చేయించి ఆయన మాట్లాడారు. ఈ–క్రాప్ నమోదు వలన వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ వర్తిస్తాయని, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధరపై పంటల కొనుగోలు చేయడం వంటి ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో భోగిమంటలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వేసి, గొబ్బిపాటలు పాడుతూ తెలుగు సంప్రదాయాన్ని గుర్తు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఉన్న భాష్యం ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ముందస్తు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ విశ్వనాథ్, ట్రాఫిక్ సీఐ వెంకటప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు.



సంప్రదాయ వస్త్రధారణలో సిబ్బంది



ఉపాధ్యాయులకు జ్ఞాపిక అందజేస్తున్న డీఎస్పీ

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కంచనపల్లెలో మంగళవారం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో రూ.13 లక్షల వ్యయంతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్న అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా భావిస్తూ, ఒక వైపు ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తూ, మరో వైపు మన ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. త్వరలోనే అంగన్‌వాడీ భవనం నిర్మించి చిన్నారులకు అందించాలని నాయకులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, సర్పంచ్ పద్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, చంద్రయ్యనాయుడు, శ్రీరాములురెడ్డి, కృష్ణమూర్తి, గిరిరెడ్డి, అలయ్య, కుమార్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ధనంజయరెడ్డి, వైస్ సర్పంచ్ గోవిందయ్య, కె.సుబ్బరాయులు, సురేష్‌బాబు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో కోడి పందేలు, జూదం నిషేధం



ఏర్పేడు: మాట్లాడుతున్న ఎస్ఐ రఫీ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు, జూదం నిషేధించినట్లు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. పండుగను మండలంలోని చిన్నారులు, యువత, ప్రజలు సంతోషంగా సంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని కోరారు. కోడిపందేలు, జూదం ఆడుతూ గొడవలు, అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడిపందేలు జరిగే ప్రాంతాలను ఎవరైనా తమకు తెలియజేస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పండుగల్లో ఎవరైనా ఇతర ప్రాంతాలకు, ఊర్లకు వెళ్లే పోలీసులకు సమాచారం తెలియజేయాలని సంబంధిత ప్రాంతాల్లో పోలీసుల గస్తీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకూడదన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, కోడిపందేలు నిర్వహించే ప్రాంతాలు తెలిస్తే వెంటనే 9440900724 నంబర్‌కి సమాచారం అందించాలని తెలిపారు.

కోడిపందేలు నేరం

ఏర్పేడు: గ్రామాల్లో కోడిపందేలు, జూదం ఆడితే నేరమని ఎస్ఐ రఫీ అన్నారు. మండలంలోని పల్లం పేట గ్రామంలో కోడిపందేలపై మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతికి గ్రామాల్లో కోడిపందేలు ఆడకూడదన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కోడిపందేలు, జూదం ఆడే గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. అలాంటి గ్రామాలపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో సంక్రాంతిని జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అబీబుల్లా పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ డైరీలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దాం



ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాళహస్తి: బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దామని ఎస్పీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజునాయుడు అన్నారు. మంగళవారం బాల్యవివాహ వ్యవస్థ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళి, అధ్యాపకులు తులసి, సత్యనారాయణరెడ్డి, నరసింహవర్మ, సారా సుబుద్ధి, రత్న పాప, కౌసర్ బేగం, సుబ్బారావు, సునీత, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మృతుల కుటుంబ సభ్యులకు మంగళవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఏర్పేడు మండలం మునగలపాళెం అరుంధతీయవాడలో నిరుపేదలు ఈశ్వరయ్య, సుబ్బయ్య, గోపి అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించి, ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున నగదు అందజేశారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఉత్తరప్రదేశ్ మంత్రి సురేష్‌రాయ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు



ముక్కంటి ఆలయంలో రవీంద్ర తాలియాతో ఉన్న ఆలయాధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉత్తరప్రదేశ్ మంత్రి సురేష్‌రాయ్, హిమాచల్‌ప్రదేశ్ చింతపూర్ణేశ్వరి ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్ర తాలియా దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణగోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రహణమొర్రిపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): గ్రామాల్లో ప్రధానంగా గ్రహణమొర్రి, గుండె సంబంధిత వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి ఈటచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కాసారం పీహెచ్‌సీలో ఐసీడీఎస్, వైద్యశాఖ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారిని కాన్పు తేదీకి వారం ముందే ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించాలని ఆశ, ఏఎన్ఎంలకు సూచించారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లల్లో పోషక ఆహార లోపాలను గుర్తించి, వారికి తగిన పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చెంచులక్ష్మి, అమ్మణమ్మ, పీహెచ్ఎన్ శాంతకుమారి పాల్గొన్నారు.

'నేచర్' చిత్రం ట్రైలర్ విడుదల రేపు

తిరుపతి కల్చరల్: శ్రీసప్తమ క్రియేటివ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'నేచర్' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం ఈనెల 12న గురువారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఇందిరా మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆ చిత్ర నిర్మాత టి.చేతన్, దర్శకుడు టి.సుధాకర్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సామాజిక సందేశం, కమర్షియల్ విలువలతో భావితరాలకు సందేశాత్మకంగా ఈ చిత్రం తీసినట్లు పేర్కొన్నారు. హీరోగా బి.కృష్ణ, హీరోయిన్లుగా, ముస్కాబిష్త్, కరిష్మారాయ్ నటించారన్నారు. ప్రజలందరూ హాజరై ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. టి.రవి, రాజేష్, భాస్కర్ పాల్గొన్నారు.